దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18: 2023-24 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివి ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులైన పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు వచ్చే విద్యాసంవత్సరం కార్పొరేట్ కళాశాలలో చదివేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున ఎంసెట్ కోచింగ్‌తో పాటు జిల్లాలో పేరుపొందిన కళాశాలలు వారి ఫీజు వివరాలు, వసతుల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఈపాస్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంబంధిత కళాశాల లాగిన్ ద్వారా ఈనెల 18నుంచి27వరకు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.



- ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- నామినేషన్లు దాఖలు చేసిన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు
- కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసుల బందోబస్తు
- నేడు నామినేషన్ వేయనున్న బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు

తొలిరోజు రెండు నామినేషన్లు



నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలైంది. తొలిరోజు గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడటంతో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రాపెల్లి సత్యనారాయణ, మరో స్వతంత్ర అభ్యర్థిగా జగిత్యాల జిల్లా రాయకల్ మండలం ఒడ్డెలింగాపూర్‌కు చెందిన బుక్యనంద్‌నాయక్ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 25 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు వేసేందుకు అధికారులు సమయం ఇచ్చారు.

కలెక్టరేట్ వద్ద భారీ బందోబస్తు

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో కలెక్టరేట్ వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కలెక్టరేట్‌లోకి ఎవరినీ అనుమతించడం లేదు. గుర్తింపు కార్డులు ఉంటే తప్ప ఉద్యోగులను, ఇతరులను కలెక్టరేట్‌లోకి అనుమతించలేదు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వివరాలు తీసుకున్న తర్వాతే పోలీసులు అనుమతించారు. మధ్యాహ్నం 3గంటల తర్వాత అందరినీ కలెక్టరేట్‌లోకి అనుమతించారు.

రిటైర్డ్ ఉద్యోగుల మద్దతుతో నామినేషన్..

: రాపెల్లి సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థి

రిటైర్డ్ ఉద్యోగులను కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నిర్లక్ష్యం చేశాయని కనీస పెన్షన్ కూడా మంజూరు కావడం లేదని రిటైర్డ్ ఉద్యోగుల మద్దతుతోనే తాను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి రాపెల్లి సత్యనారాయణ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో తాను నామినేషన్ వేశానని రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పార్లమెంట్‌లో ప్రశ్నిస్తానన్నారు. 1995లో పెన్షన్ 7,500, డీఏ ఇవ్వాలని కొట్లాడుతూ వస్తున్నానని, ఎంత మంది కేంద్ర మంత్రులను కలిసినా ఫలితం లేదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల గళాన్ని వినిపించేందుకే పార్లమెంట్‌లో పోటీ చేస్తున్నానని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు బస్సు డిపోల వారీగా 15వేల మంది రిటైర్డ్ ఉద్యోగుల మద్దతు తనకు ఉందన్నారు.



ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సత్యనారాయణ



కలెక్టరేట్ ఆవరణలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

విద్యార్థులను అన్ని పార్టీలు మోసం చేస్తున్నాయి..

: బుక్యనంద్ నాయక్, స్వతంత్ర అభ్యర్థి

విద్యార్థుల రాజకీయ పార్టీ తరఫున తాను పార్లమెంట్ ఎన్నికలో పోటీ చేస్తున్నట్లు బుక్యనంద్ నాయక్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమాల నుంచి నీళ్లు, నిధులు, నియామకాలు అందరికి ఉచిత విద్య అందాలనే ఉద్దేశంతో విద్యార్థుల రాజకీయ పార్టీ పుట్టిందన్నా రు. తెలంగాణ వచ్చిన తర్వాత అందరికి ఉద్యోగాలు, నీళ్లు, నిధులు, ఉచిత విద్య అందడం లేదని విద్యార్థులను అన్ని పార్టీలు మోసం చేస్తున్నాయని అన్నారు. ఒకసారి పార్లమెంట్‌లో నిరుద్యోగులకు అవకాశం ఇస్తే వారి వాణిని వినిపిస్తానని తెలిపారు.



నేడు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల నామినేషన్లు

బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు వేయనున్నారు. భారీ ఎత్తున ర్యాలీలతో కలెక్టరేట్‌కు వచ్చి నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ నేతలు, కీలకమైన నాయకులు ఈ నామినేషన్లకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ ప్రక్రియ ముగియగానే పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో భారీ బహిరంగ సభలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

బీఆర్ఎస్ తరపున మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బీఆర్ఎస్ తరపున మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఈ నామినేషన్‌కు పార్టీకి చెందిన మాజీ మంత్రి హరీష్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, రాజ్యసభ సభ్యులు కెఆర్ సురేష్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, స్థానిక సంస్థ ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించగానే మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పార్లమెంట్ పరిధిలో పలు మండలాల్లో సమావేశాలు నిర్వహించారు. పార్టీ నేతలు క్యాడర్‌తో పాటు ఇతర వర్గాల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేశారు. పదేళ్లలో చేసిన పనులను వివరించడంతో పాటు ఈ దఫా తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.

రైతులతో కలిసి నామినేషన్ వేయనున్న అర్వింద్

పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ శుక్రవారం పసుపు రైతులతో కలిసి నామినేషన్ వేయనున్నారు. ఒకసెట్ నామినేషన్ దాఖలు చేసి మరోసెట్ ఈనెల 25న చివరి రోజు నామినేషన్ వేయనున్నారు. చివరి రోజు వేసే నామినేషన్‌కు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పట్నవీస్ హాజరుకానున్నారు. అదే రోజు భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆరోజు భారీ ఎత్తున క్యాడర్‌ను నామినేషన్‌కు వచ్చే విధంగా చూడటంతో పాటు నగరంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రచారాన్ని పలు దఫాలు నిర్వహించిన బీజేపీ అభ్యర్థి మరింత జోష్‌గా భారీ సభలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

ఈనెల 22న జీవన్‌రెడ్డి నామినేషన్

కాంగ్రెస్ తరఫున పార్లమెంట్ బరిలో నిలిచిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఈనెల 22న నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. అదే రోజు తన మద్దతుదారులతో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చి నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నామినేషన్ ప్రక్రియ పూర్తికాగానే భారీ బహిరంగ సభలను నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో నిర్వహించే ఈసభలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. పోలింగ్ చివరి నాటికి పార్లమెంట్ పరిధిలో జగిత్యాల లేదా కోరుట్లలో మరోసభ నిర్వహించడంతో పాటు ఆ సభకు కూడా సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే విధంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

రేపు కార్యకర్తల సన్నాహక సమావేశం

● బీజేపీ ఎల్లారెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 18: ఈనెల 20న ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని బీజేపీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఎల్లారెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20న ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో కార్యకర్తల సన్నాహక సమావేశం ఉంటుందని, సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమం ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి నరేష్, వీకే సీనియర్ నాయకులు బాల్‌రాజ్, బాలకిషన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'నేత్రదానం ఇద్దరు అంధులకు చూపునిస్తుంది'



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న పట్టణ ప్రముఖులు

బోధన్‌రూరల్‌ఏప్రిల్18: నేత్రదానం ఇద్దరు అంధులకు చూపునిస్తుందని, నేత్రదానం అన్ని దానాల కంటే గొప్పదని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో బొడ్డు వెంకటేశ్వర్ రెడ్డి(90)అనే వ్యక్తి మృతి చెందగా లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ద్వారా నేత్రదానం హైదరాబాద్‌లో ఎల్‌వీ ప్రసాద్‌కు పంపారు. అవయవదానం కోసం పార్థిక దేహన్ని నిజామాబాద్ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు, కాలనీవాసులు నివాళులు అర్పించారు.

● గురువారం ఆచన్‌పల్లికి చెందిన మెట్ట నాగ అంజమ్మ మరణ అనంతరం వారి నేత్రాల దానం వల్ల ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు నివాళులు అర్పించారు. నేత్రదానం అన్నింటికి కంటే గొప్పదని పేర్కొన్నారు.

సేవ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్18: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిచౌరస్తాలో రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు ఖాందేశ్ శ్రీనివాస్ చలివేంద్రాన్ని ప్రారంభించి బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం తమవంతు కృషి చేయాలని ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్ష స్వచ్ఛంద సంస్థ ప్రధానకార్యదర్శి విద్యాప్రవీన్ పవార్, ఉపాధ్యక్షుడు జిందం నరహరి, విద్యగోపి, బేతు గంగాధర్, పట్వారి తులసీ, ఖాందేశ్ సత్యం, మీర శ్రావణ్, మక్కల సాయినాథ్, షహీద్, నరేందర్, సురేష్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన ఆలయ అభివృద్ధి కమిటీ



ఎన్నికైన ప్యాట్ల హన్మాన్ మందిర కమిటీ సభ్యులను సన్మానించిన దృశ్యం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్18: పట్టణంలోని ప్యాట్ల హన్మాన్ మందిర కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా నగేష్‌శర్మ, పోలసుధాకర్, అధ్యక్షులుగా దోండి శ్యామ్ మనోహర్, ప్రధానకార్యదర్శి పుప్పాల సతీష్, కోశాధికారి బండారి నరేందర్, ఉపాధ్యక్షులుగా ద్యాగ శ్రీనివాస్, దోండి దేవేందర్, దన్‌పాల్ విజయ్‌కుమార్, కార్యదర్శులుగా కొటికె విజయ్‌కుమార్, రుద్రవేణి అశోక్, కోల రాజు, సలహాదారులుగా ద్యాగ ఉదయ్, బోంపల్లి బాపురాజ్, కోల మధుకర్, ద్యాగ శ్రీనివాస్, పుప్పాల గిరిధర్, వైద్యరవీందర్, డి.స్వామిరాజులను ఎన్నుకోగా వారని పలువురు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు ప్రమాణ స్వీకారం చేశారు.

కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ కలీం

రెంజల్‌ఏప్రిల్18: మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం తహసీల్దార్ కలీం పరిశీలించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సరిహద్దుల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కొనేందుకు సమయాత్తం అవుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన భద్రత పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తామన్నారు. మహారాష్ట్ర-తెలంగాణలో ఉన్న చెక్‌పోస్టును రెవెన్యూ, పోలీసు శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కమ్మర్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లి వద్ద పోలీస్‌చెక్‌పోస్టు గురువారం తిరిగి ప్రారంభమయింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌అమలు అయిన తరువాత మార్చి 17న కమ్మర్‌పల్లి శివారులోని బ్రహ్మగారి గుట్టవద్ద పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఆర్మూర్ ఏసీపీ గట్టు బస్వారెడ్డి సందర్శించి పరిశీలించి వాహనాల తనిఖీ బృందం సిబ్బందికి పలుసూచనలు చేశారు. అయితే ఏప్రిల్ 3న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు చెక్‌పోస్టును ఎత్తివేశారు. తిరిగి ఆదేశాలు రావడంతో గురువారం చెక్‌పోస్టును తిరిగి ప్రారంభించి జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీలు చేపట్టారు. గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, కమ్మర్‌పల్లి ఎస్‌ఐ రాజశేఖర్, స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి డబ్బులు తరలిస్తే వాటికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సి ఉంటుందని లేని పక్షంలో రూ.50లకు మించి తరలించే డబ్బులు సీజ్‌చేయడంతోపాటు సదరువ్యక్తిపై కేసునమోదు అవుతోందని ఎస్.ఐ రాజశేఖర్ తెలిపారు.

ఉపాధి కూలీలకు 200రోజులు పని కల్పించాలి

మోర్తాడ్, ఏప్రిల్18: ఉపాధి హామీ కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 200రోజులు పని కల్పించి రోజువారి కూలీ పెంచాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ అన్నారు. జిల్లా కార్యదర్శి జి.కిషన్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దొన్కల్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ కూలీలకి జాబ్‌కార్డు ఇవ్వాలని, గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరల అనుగుణంగా రోజువారి కూలీ కొలతలతో నిమిత్తం లేకుండా రోజుకు రూ.600 చొప్పున కూలీల ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు, మెట్లకు జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి.అశోక్, మహిళ సంఘం నాయకురాలు సత్తెక్క, కూలీలు పాల్గొన్నారు.



దొన్కల్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నగరంలో నెంబర్ ప్లేట్ లేని బర్గ్‌మెన్ వాహనాలు

- రాజధాని బైకులు నగరంలో..
- అక్కడ కొనుగోలు .. ఇక్కడ వినియోగాలు
- నెంబరు ప్లేట్ లేకుండానే యధేచ్ఛగా సంచారం
- పట్టించుకోని పోలీసులు

ఖిల్లా, ఏప్రిల్ 18 :రాజధాని హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన బర్గ్‌మెన్ ద్విచక్రవాహనం నగరంలో విచ్చలవిడిగా నడుస్తున్నాయి. నంబరు ప్లేటు లేకుండానే వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్న పోలీసులు మాత్రం వాటిని పట్టించుకున్న పాపన పోలేదు. ఇటీవల వాహనాల దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు నగరంలో జరుగుతున్నా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తూన్నపట్టికి ఓ ప్రాంతంలో విచ్చలవిడిగా వందల సంఖ్య లో బర్గ్‌మెన్ ద్విచక్రవాహనాలను నడుస్తున్న పోలీసులు మాత్రం వాటిని పట్టుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● జరుగుతుందిలా

హైదరాబాద్ కేంద్రంగా సుజీకి కంపెనీ తయారు చేసిన బర్గ్‌మెన్ ద్విచక్రవాహనం కొత్త హంగులతో రూపొందించి మార్కెట్‌లో విడుదల చేశారు. వినియోగదారులు వాహనం సౌకర్యంగా ఉండడంతో వాటిని కొనుగోలు చేయడానికి ఉత్సాహపడుతున్నారు. వినియోగదారుల డిమాండ్‌ను బట్టి ఆ వాహనానికి వివిధ ఫైనాన్స్ కంపెనీలు రుణసదుపాయాలను కల్పిస్తుంది. అయితే వాటిని మాత్రం హైదరాబాద్ చిరునామ ఉన్న ఆధార్‌కార్డుతో తక్కువ డౌన్‌పేమెంట్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. దానిపై రుణం ఉండడంతో దానికి నంబరు కావలంటే వాహనంకు సంబంధించి పూర్తి రుణం చెల్లించిన అనంతరం నంబర్ రాసుకునే అవకాశం ఉంటుంది. దాని ఆర్‌సి సైతం రుణం ఇచ్చిన వారి వద్దనే ఉంటుంది. అటువంటి వాహనాలను నగరానికి చెందిన కొందరు వాటిని ఇక్కడకు తీసుకొచ్చి కేవలం రూ.30వేలు, 40వేలకు ఇచ్చివేస్తున్నారు. అసలు దాని ధర రూ.1లక్ష30వేలు ఉండగా తక్కువకు



నగరంలో బర్గ్‌మెన్ ద్విచక్రవాహనం

ఇవ్వడంతో నగరానికి చెందిన కొందరు యువకులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన వాహనాలను ఇక్కడ దర్జాగ వినియోగిస్తున్నారు. అటువంటి వాహనాలకు రుణాలు ఇచ్చిన ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్లు మాత్రం ఆధార్‌కార్డు ఆధారంగా సదరు ఇంటికి వెళ్లి వాహనం గురించి విచారణ చేయగా అక్కడ సదరు వ్యక్తులు ఎవరు ఉండక పోవడంతో వారు ఆ వాహనం కోసం హైదరాబాద్ ప్రాంతంలోనే తిరుగుతున్నారు. కాని నగరానికి వచ్చి మాత్రం వాహనాల గురించి విచారించకపోవడంతో వీటి వినియోగంతోపాటు అమ్మకలు సైతం జోరుగా కొనసాగుతున్నాయి. వీటిని ఒకే వర్గానికి చెందిన యువకులు మాత్రం కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో పోలీసు వాహనాల తనిఖీలు ఎక్కువగా ఉండకపోవడంతో యువకులు వాటిని యదేచ్ఛగా వాడుతున్నట్లు తెలిసింది.

● గతంలో ఇదే తరహాలో కార్ల దిగుమతి

గతంలో నగరానికి చెందిన కొందరు వ్యక్తులు పూణే, ఇండోర్ ప్రాంతాల నుంచి విలువైన ఫార్చునర్, ఇన్నోవా లాంటి కార్లను అడ్డదారుల్లో తీసుకొచ్చి వాటిని అతి తక్కువ ధరలకు అమ్మడం చేసే వారు. రూ.30-35లక్షలు ఉన్న ఫార్చునర్ కారును కేవలం 12-15లక్షలకు అమ్మేవారు. అమ్మేవారు మాత్రం జిల్లాకు చెంది విదేశాల్లో ఉండే వారికి మాత్రమే అమ్మేవారు. ఇలా చేయడం ద్వారా వారు ఇక్కడికి సెలవుపై వచ్చి వాటిని వినియోగించి తిరిగి వాటిని ఇండ్ల ఎదుట ఉంచి పోవడం జరుగుతుందనే భరోసాతో అటువంటి వాహనాలను విదేశాల్లో ఉపాధి పొందే వారికి మాత్రమే అమ్మి సొమ్ము చేసుకునేవారు.

● ఎలా తెచ్చే వారంటే

ఇతర రాష్ట్రాల్లో రుణాలు చెల్లించని వాహనాలను అక్కడి వ్యక్తులతో పరిచయాలు పెంచుకని వాటిని అడ్డదారిన తీసుకొచ్చే వారు. ఇతంతంగా చాల రోజులు జరిగింది. అనంతరం అప్పటి పోలీసుల దృష్టిలో రాగానే వాటి గుట్టు రట్టు చేసి నిందితులను సైతం పట్టుకున్న దాఖలాలు ఉన్నాయి. అనంతరం ఈ వ్యవహారం నడిపే వారు పోలీసులకు తెలిసి పోవడంతో వాటి జోళికి వెళ్లడం మానివేశారు. ప్రస్తుతం అదే తరహాలో కార్లకు బదులు ద్విచక్రవాహనాలను కొందరు యువకులు హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి వాటిని తక్కువ ధరలకు అమ్మడం వ్యాపారంగా చేసుకున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఆ దిశగా దృష్టి పెట్టి వాటి గుట్టు రట్టు చేస్తారని వేచి చూస్తాం.

లారీ బైక్ ఢీకొని యువకుడి మృతి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్18: మండలంలోని జక్రాన్‌పల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయరహదారిపై గురువారం లారీ, బైక్ ఢీకొని నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహవీర్‌తండాకు చెందిన జాదవ్ సుధాకర్ (35) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మృతుని భార్య శీరిషకు తీవ్రగాయాలు కాగా పరిస్థితి సీరియస్‌గా ఉందని పోలీసులు తెలిపారు. ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహవీర్ తండాకు చెందిన జాదవ్ సుధాకర్ ఇతని భార్య శిరీష కలిసి బైక్‌పై నిర్మల్, ఆర్మూర్, జక్రాన్‌పల్లి మీదుగా మృతుని అత్తగారి గ్రామమైన గాంధారి మండలం వెంకటాపూర్ గ్రామానికి వెళ్తుండగా జక్రాన్‌పల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయరహదారిపై లారీ చెడిపోయి రోడ్డుపై ఆగి ఉండగా వెనుక నుంచి వచ్చి బైక్‌ను లారీ ఢీకొందని ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంలో జాదవ్ సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందారు. భార్య శిరీషకు తీవ్రగాయాలు కాగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుందని, ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జాదవ్ సుధాకర్

మహిళ హత్య కేసులో నేరస్తుడి అరెస్టు

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 18: ఆర్మూర్ పట్టణంలోని సంతోష్ నగర్ కాలనీలో జరిగిన హత్య కేసులో జిల్లా కేంద్రంలోని నాగారం బీడీ వర్కర్స్ కాలనీలో నివాసం ఉంటున్న అల్లపు మల్లయ్య అనే నేరస్తుడిని గురువారం అరెస్టు చేసినట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏడేళ్ల క్రితం మృతురాలి ఇంట్లో కిరాయి ఉన్న మల్లయ్య తరచూ వారి ఇంటికి వస్తూ పోతుంటాడు. మార్చి 23న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటరిగా ఉన్న రాసూరి లాస్యను కొడవళితో హతమార్చి సుమారు 71 గ్రాముల వెండి, 25 గ్రాముల బంగారాన్ని దొంగిలించకుని వెళ్లాడు. సీసీ కెమెరాల ఆధారాలతో పాత నేరస్థుల రికార్డుల ఆధారంగా పోలీసులు నిందితున్ని తన ఇంటివద్ద పట్టుకుని విచారంచగా హత్య నేరం ఒప్పుకున్నాడు. దీంతో నిందితున్ని అదుపులోనికి తీసుకుని ఎత్తుకెళ్లిన బంగారం వెండి నగలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. నేరస్తునిపై ఇప్పటికే 11 దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. హత్య కేసును దర్యాప్తు చేసి ఎస్‌ఎచ్‌ఓ రవికుమార్, ఏరుగట్ల ఎస్సై మచ్చేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబల్ తిరపతి, కాన్స్టేబుల్ గంగా ప్రసాద్, ప్రసాద్, శీకాంత్ గౌడ్, రాజేశ్వర్‌లను ఏసిపి బసవ రెడ్డి ఆద్వర్యంలో సిపి కల్మేశ్వర్ అభినందించి రివార్డులను అందజేశారు.

ఉపాధి కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా చూడాలి



గన్‌పూర్‌లో ఉపాధి హామీ కూలీల వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీవో పీడీ



నడిపల్లిలో ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డీఆర్‌డీవో పీడీ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18:డిచ్‌పల్లి మండలంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు ఇతర ప్రాంతాలకు కూలీ నిమిత్తం వెళ్లకుండా ఉన్నచోటే ఉపాధి పని కల్పించే విధంగా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ తెలిపారు. గురువారం డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి గన్‌పూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు ప్రస్తుత పరిస్థితుల్లో కావాల్సిన సదుపాయాలను కల్పించి పనులు చేసే కూలీలకు సకాలంలో డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డు లేని వారికి తక్షణమే అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీడీ ఓంపాల్, ఏపీవో సుధాకర్, నడిపల్లి సెక్రెటరీ కిషన్‌రావు, గన్‌పూర్ సెక్రెటరీ సునీల్‌కుమార్,ఉపాధిహామీ సీఏలు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోటగిరి,ఏప్రిల్18: కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ప్రతినిధులు రవి, హన్మంత్ రావులు తెలిపారు. బుధవారం కోటగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని చావిడి వద్ద వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వైద్యుల బృందం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. షుగర్ వ్యాధి, గుండె సంబంధమైన వ్యాధి, మానసిక వ్యాధి, క్యాన్సర్ వ్యాధి లక్షణాలు గల వారు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అత్యధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య పరీక్షలు నిర్వహించి స్క్రీన్ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అవసరమైన మందులను పంపిణీ చేస్తారని ఈ అవకాశాన్ని వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారు క్యాన్సర్ సంబంధమైన లక్షణాలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సంతోష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఖిల్లా డిచ్‌పల్లిలో వడదెబ్బతో వ్యక్తి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18: రోజు రోజుకు పెరుగుతున్న ఎండలతో జనాలు అల్లాడుతున్నారు. ఎండ తీవ్రత 30డిగ్రీల నుంచి 40 డిగ్రీల దాటి పోతుండంతో పశుపక్షాదులు మృతి చెందుతున్నాయి. అలాగే మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన కొత్తూరు ఎల్లాగౌడ్ (74)మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఈనెల 16నఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.డిచ్‌పల్లి శివారులోగల గా యత్రీ ఎన్‌క్లేవ్ వద్ద వడదెబ్బతో గురువారం మృతి చెం దినట్లు ఎస్సై మ హేష్ తెలిపారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వడదెబ్బతో వ్యక్తి మృతి ఎల్లాగౌడ్

రెండో రోజు సీఎంసీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు



డిచ్‌పల్లిలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18: డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి శివారులోగల సీఎంసీ వైద్య కళాశాలలో గురువారం రెండవ రోజు కూడా మెదక్ డయాలసీస్ ఆ ధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రా మీణ ప్రజానీకానికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 250 మంది గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విమల్ సుఖుమార్, డాక్టర్ ప్రభుకిరణ్, డాక్టర్ సోల్‌మాన్, డాక్టర్ దయానంద్, శ్యామ్‌సన్, తదితరులు పాల్గొన్నారు.

పెగడాపల్లిలో మరిగమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన



పెగడాపల్లిలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్‌ఏప్రిల్18: బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో మరిగమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో హోమం, యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం మరిగమ్మ దేవి యంత్ర ప్రతిష్టాపన మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించబడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మరిగమ్మ విగ్రహ ప్రతిష్టాప కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయంలో గణపతి ఆరాధన, పుణ్యవచనం, హోమం, యజ్ఞం, ధాన్యాధివాసం, ఫల పుష్ప మొదలగు పూజలు నిర్వహించారు. శనివారం ప్రాణ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు రామయ్య, అబ్బయ్య, పోశెట్టి, భాను ప్రకాష్, మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భారీ బహిరంగ సభ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18: నిజామాబాద్ ఓల్డ్ కలెక్టరేట్ వద్ద బీఆర్‌ఎస్ బహిరంగ సభకు నేడు సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు హాజరవుతున్నారని ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు జగన్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ నామినేషన్ కూడా దాఖలు చేస్తారని జిల్లాలోని మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఇద్దరికి గాయాలు

మోస్రా,ఏప్రిల్18: మోస్రా మండలంలోని గోవూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి వడ్ల కుప్పలను ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దకు వ్యక్తులకు గాయాలయ్యాయి. మోస్రాలో సీతారాముల పల్లకిసేవ కార్యక్రమం ముగించుకుని బాన్సువాడ వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి గమనించిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రోడ్లపై వడ్ల కుప్పలు వేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ కృష్ణ కుమార్ హెచ్చరించారు.

అంగరంగ వైభవంగా శ్రీరాములవారి కల్యాణం

ఎడపల్లి, ఏప్రిల్ 18: ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ రామ మఠంలో గురువారం శ్రీ సీతా రాముల వారి కల్యాణ వేడుకలు శ్రీ రామ మఠ పీఠాధిపతులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామ మఠ పీఠాధిపతులు జయరామ్ మహరాజ్ మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా నవమి రోజు జన్మదిన వేడుకలు నిర్వహించి, దశమి రోజు స్వాముల వారి కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా నేడు కళ్యాణ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు. స్వామి వారి కళ్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలలో గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐల సస్పెన్షన్

ఖిల్లా, ఏప్రిల్ 18: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించిన ఇద్దరు సీఐలను సస్పెన్షన్ చేస్తూ ఐజీ రంగనాథ్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. బోధన్ సీఐ ప్రేమ్ కుమార్ హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ కేసును పక్కదారి పట్టించారు. పంజగుట్ట సీఐ ప్రేమ్ కుమార్ ఒకే బ్యాచ్‌మేడ్ కావడంతో కేసును పక్కదారి పట్టించారు. దీనితో పంజాగుట్ట, బోధన్ సీఐలపై కేసులు నమోదుయ్యాయి. దీంతో బోధన్ సీఐ ప్రేమ్‌కుమార్‌ను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ కేసులో డిపార్మెంట్ విచారణ పూర్తి కావడంతో ప్రేమ్ కుమార్‌ను సస్పెన్షన్ చేశారు. అలాగే నగరంలోని రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారం దొంగతనం కేసులో మద్యం సేవించి విచారణకు వెళ్లిన సీసీఎస్ సీఐ రమేష్ పై విచారణ జరగడంతో పోలీసులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐజీ రంగనాథ్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేవారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఇద్దరు సీఐలను సస్పెండ్ చేసినట్లు పోలీస్ వర్గాలలో చర్చ జరుగుతుంది.



బీ-ఫాం అందుకుంటున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకున్న బాజిరెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయనున్న నిజామాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పార్టీ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీ-ఫాం అందుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థులకు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ బీ-ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ తరఫున పోటీ చేయనున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డికి పార్టీ ఉమ్మడి జిల్లా నేతల ఆధ్వర్యంలో బీ-ఫాం అందజేశారు. అనంతరం కేసీఆర్ బాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్‌గుప్త, జీవన్‌రెడ్డి, జెడ్పీ ఛైర్మన్లు విఠల్‌రావు, వసంత, అలీమ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎడ్ సెమిస్టర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 18: బీఎడ్ సెమిస్టర్ మొదటి సంవత్సరం మొదటి రోజు గురువారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 1311కు గాను 1254 మంది హాజరుకాగా, 57 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎస్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాన్సువాడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్, బోధన్ సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

● నేడు డిగ్రీ పరీక్షలకు వన్‌టైమ్ ఛాన్స్

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని 2011 నుంచి 2016 విద్యా సంవత్సరం వరకు డిగ్రీ ఇయర్ వైస్ పరీక్షలకు వన్‌టైమ్ ఛాన్స్ అవకాశం ఇవ్వడం జరుగుతుందని పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ అరుణ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు సంబంధించి బ్యాక్ లాగ్ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు జూన్, జూలై నెలలో జరుగుతాయని పరీక్ష ఫీజుకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా మే2వ తేదీ వరకు, రూ.100 అపరాధ రుసుముతో మే 3వరకు ఫీజు చెల్లించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విప్లవ ఉద్యమం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు

పెద్దబజార్, ఏప్రిల్ 18: కామ్రేడ్ డీవీ కృష్ణ తన జీవితాంతం విప్లవ ఉద్యమం కోసం అవిశ్రాంతతగా కృషి చేశారని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. గురువారం నగరంలోని రేడియో స్టేషన్ ఎదురుగా సాయినగర్‌లో విప్లవ ఉద్యమ నేత కార్మిక యోధుడు అమరుడు డీవీ కృష్ణ స్మారకస్థూప నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969లో డీవీ కృష్ణ లేబర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగానికి రాజీనామా చేసి విప్లవ ఉద్యమంలోకి వచ్చారని తెలిపారు. జిల్లాలో పార్టీ కార్మిక రైతుకూలీ ఉద్యమాల నిర్మాణాన్ని తీర్చిదిద్దారని అన్నారు. సిరిసిల్లా రైతాంగం పోరాటానికి మూలబిందువుగా నిలిచారన్నారు. కామ్రేడ్ డీవీ కృష్ణ ద్వితీయ వర్ధంతి జూన్ 26న స్థూప ఆవిష్కరణ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ప్రభాకర్, రాష్ట్ర నాయకులు నరేందర్, దేవరాం, సాయాగౌడ్, సుధాకర్, సంధ్యారాణి, సాయిబాబా, సాయిరెడ్డి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనాన్ని తండాలోనే నిర్మించాలి

సిరికొండ, ఏప్రిల్ 18: సిరికొండ మండలం సరిపెల్లి తండాలో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించాలని కోరుతూ గురువారం నాడు గిరిజనులు రాస్తారోకో చేశారు. సిరికొండ, నిజామాబాద్ వెళ్లే రోడ్డుపై గిరిజన మహిళలు, యువకులు రోడ్డుపై కూర్చొని సుమారు గంట సేపు రాస్తారోకో చేశారు. సరిపెల్లి తండా పరిధిలో శ్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరి కాలనీ ఉన్నందున గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నందున వారు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. నిజామాబాద్, భీంగల్, సిరికొండ వెళ్లే వాహనాలన్నీ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవనాన్ని సరిపెల్లి తండాలోనే నిర్మించాలని కోరారు. అన్నపూర్ణేశ్వరి కాలనీలో నిర్మించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. సిరికొండ ఎస్సై రమేష్, ఏఎస్సై బాల్‌సింగ్ సంఘటన వద్దకు వెళ్లి గిరిజనులు చేస్తున్న రాస్తారోకో కార్యక్రమాన్ని వారికి నచ్చచెప్పి విరమించారు.

ఆలయ పనుల పరిశీలన

సిరికొండ, ఏప్రిల్ 18: న్యావనంది గ్రామానికి చెందిన వ్యక్తులు పనులు నాసిరకంగా జరిగాయని చేసిన ఫిర్యాదు మేరకు ఏడీ ఓంప్రకాశ్ గురువారం ఆలయాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. ఈ ఆలయ నిర్మాణానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు రూ.15లక్షలు విరాళాలు చెల్లించగా ప్రభుత్వం రూ.15లక్షలు కలుపుకొని అదనంగా రూ.30లక్షలు మంజూరు చేసింది. ఈ పనులు నాసిరకంగా జరిగాయని స్థానికులు ఫిర్యాదు చేయడం వల్ల గురువారం ఏడీ ఓంప్రకాశ్ ఆలయ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మేరకు పనులు నాసిరకంగా జరిగాయని అంగీకరించారు. నిధులు మాత్రం ఇప్పటి వరకు కేవలం కొంత వరకు నిధులు చెల్లించామని మిగతా పనులు చేసేవరకు నిధులు చెల్లించేది లేదని చెప్పారు. నాసిరకంగా పనులు జరిగిన వాటిని తొలగించి మళ్లీ పనులు చేయిస్తామని ఏడీ ఓంప్రకాశ్ తెలిపారు.

బీజేపీలో భారీగా చేరికలు

పెద్దబజార్, ఏప్రిల్ 18: పనిచేసిన వారికి బీజేపీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో మటంల శేఖర్ ఆధ్వర్యంలో రూరల్ నియోజకవర్గం నుంచి భారీ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి ఎంపీ అర్వింద్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో భాగంగా పనిచేసి తన గెలుపుకు సహకారం అందించాలని కోరారు. వంద మందితో చేరడం సంతోషంగా ఉందని మోదీ దేశవ్యాప్తంగా చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరుతున్నారని అన్నారు. అనంతరం మటంల శేఖర్ మాట్లాడుతూ నాడు బీఎస్పీ తరఫున ఎమ్మెల్యేగా పోటీలో నిలిచానని నేడు దేశప్రధాని మోదీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ ఎంపీ అర్వింద్, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి ఆధ్వర్యంలో పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, ధర్మేందర్, గోవర్ధన్, మహేందర్, రంజిత్, రాజేశ్, రవీందర్ పార్టీలో చేరారు.



నగరంలో యువకులను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అర్వింద్

ఐడీసీఎంఎస్ చైర్మన్‌పై నేడు అవిశ్వాసం!

- మూడు పదవులకు పొంచి ఉన్న గండం!
- నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా, ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్‌గా కొనసాగుతున్న సాంబారి మోహన్



సాంబారి మోహన్

ఇందల్వాయి, ఏప్రిల్ 18: ఉమ్మడి జిల్లా ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్‌పై ఇచ్చిన అవిశ్వాస నోటీసులతో మూడు పదవులకు గండం పొంచి ఉంది. నల్లవెల్లి సహకార సొసైటీ ఛైర్మన్‌గా ఎన్నికై అనూహ్య పరిణామాల మధ్య ఐడీసీఎంఎస్ ఛైర్మన్‌గా మోహన్ ఎన్నికయ్యారు. అనతికాలంలోనే మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయనకు చిక్కులు ఎదురయ్యాయి. గత నాలుగు సంవత్సరాలుగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అండదండలతో నల్లవెల్లి సొసైటీ ఛైర్మన్‌గా, ఐడీసీఎంఎస్ ఛైర్మన్‌గా, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఉన్నత పదవులు పొంది ఏకచక్రాధిపతిగా కొనసాగారు. రాష్ట్రంలో ప్రభుత్వం వారిపోవడంతో ఆయనకు పదవిగండం ముంచుకొచ్చింది. నల్లవెల్లి సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టడంతో ఇప్పుడు ఆయన పదవికి ముప్పు ఏర్పడింది. ఇప్పటికే తొమ్మిది మంది డైరెక్టర్లు గత నెల రోజులుగా క్యాంపులో ఉంటున్నారు. శుక్రవారం డీసీవో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బలనిరూపణ పరీక్షను ఆయన ఎదుర్కోనున్నారు. ఈ పరీక్షలో అవిశ్వాసం వీగిపోతుందా? నెగ్గుతుందా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అవిశ్వాసం నెగ్గితే ఆయన నల్లవెల్లి సొసైటీ ఛైర్మన్‌తో పాటు ఉమ్మడి జిల్లా ఐడీసీఎంఎస్ ఛైర్మన్ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పదవులను కోల్పోవాల్సి వస్తుంది. అధికార పార్టీలోని ఓ కీలక నేత ఈ వ్యవహారం మొత్తం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన పదవిని కాపాడుకునేందుకు ఇప్పటికే రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిసినప్పటికి ఆయన ప్రయత్నాలు ఫలించలేదని సమాచారం. ఐడీసీఎంఎస్ ఛైర్మన్‌గా సాంబారి మోహన్ ఎన్నికైనప్పటికీ ఐడీసీఎంఎస్ నష్టాల్లో ఉండేదని ఇప్పుడు ఐడీసీఎంఎస్‌ను ఆయన లాభాల బాటలోకి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. 2020 ఫిబ్రవరిలో ఆయన ఐడీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇందులో మొత్తం పది మంది డైరెక్టర్లతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 కొనుగోలు కేంద్రాలను ఐడీసీఎంఎస్ నిర్వహిస్తుందని అన్నారు. మోహన్ బాధ్యతలు చేపట్టేనాటికి సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ప్రస్తుతం లాభాల బాటలోకి తీసుకొచ్చారని కొందరు చర్చించుకుంటున్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

ఖిల్లా, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. డబ్బు, మద్యం తరలింపుపై దృష్టి పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నగదును పట్టుకుంటున్నారు. పోలీసు తనిఖీల్లో ఇప్పటి వరకు పట్టుకున్న డబ్బు, మద్యం వివరాలను పోలీసు శాఖ వెల్లడించింది. గురువారం వరకు పట్టుకున్న వాటి వివరాలను పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ ప్రకటనలో వివరించారు. నిజామాబాద్ అర్బన్‌లో ఇప్పటి వరకు రూ.39లక్షల92వేల497నగదు, రూ.18లక్షల 19వేల విలువైన మద్యం, రూరల్ నియోజకవర్గంలో రూ.లక్షా75వేల నగదు, 2లక్షల 43వేల 498విలువ చేసే మద్యం, ఆర్మూర్ నియోజకవర్గంలో రూ.67వేల 200 నగదు, లక్షా 32వేల మద్యం, బాల్కొండ నియోజకవర్గంలో రూ.5లక్షల 90వేల నగదు, 3లక్షల 87వేల మద్యం, బోధన్ నియోజకవర్గంలో రూ.54వేల620 నగదు, లక్షా 63 వేల విలువైన మద్యం, బాన్సువాడ నియోజకవర్గంలో రూ.4లక్షల 60వేల నగదు, లక్షా 39 వేల విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు సీపీ తెలిపారు.



కమ్మర్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్18: పట్టణంలోని పెట్రోల్ పంప్ భారత్‌గ్యాస్, ఎంవీఆర్ రైస్‌మిల్లులో అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది పలు సూచనలు చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మధుసూధన్ రెడ్డి, ఎల్ఎఫ్‌లు ప్రకాష్, అనంత్‌రావు, ఎఫ్ఎం వంశీ, రాజ్‌కుమార్, విజయేం దర్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

డొంకేశ్వర్: అగ్నిప్రమాదాలు సంభవించకుండా ప్రజలందరు జాగ్ర త్తలు తీసుకోవాలని అగ్నిమాపక హెడ్‌కానిస్టేబుల్ మధుకర్ అన్నా రు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం డొంకేశ్వర్ మం డలం నడ్కుడ గ్రామంలో ఎల్‌పీజీ గోదాంను పరిశీలించి వారోత్సవాలను నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అగ్నిప్రమాదాల నివారణ కోసం ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నట్లయితే ఏటువంటి ప్రమాదాలు జగర కుండా అరికట్టవచ్చని అన్నారు. ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినప్పుడు మంటను ఆర్పడానికి నీటని ఉపయోగించుండా పొడి ఇసుకను వాడాలని సూచిం చారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకైతే ఏటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌మెన్ సుధాకర్, డ్రైవర్ రాములు, హోంగార్డు మధు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో అగ్ని ప్రమాదంపై జాగ్రత్తలు తెలుపుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఘనంగా శ్రీరాముడి పట్టాభిషేకం



బోధన్‌లో పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



మోస్రాలో రాముని పల్లకీ సేవలో పాల్గొన్న ఏనుగు రవీందర్ రెడ్డి

బోధన్‌రూరల్,ఏప్రిల్18: బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల శ్రీ రామాలయంలో గురువారం శ్రీరాముడి పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కోదండ రామాలయం ప్రాంగణంలో శ్రీరాముల వారి పట్టాభిషేకం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టాభిషేకం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మోస్రా: మోస్రా మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో గురువారం శ్రీరాముని పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాముని పల్లకిసేవ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకిసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితుడు శ్రీనివాస్, నవీన్, మోస్రా మండల కన్వీనర్ కొత్తకొండ భాస్కర్, మండల అధ్యక్షుడు కొత్తి మీర్‌కర్ లక్ష్మణ్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, గ్రామ అధ్యక్షుడు సైనాపురం నర్సారెడ్డి, బిల్లా రాజు, హరీష్, చింటు, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



ధర్పల్లిలో కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

ధర్పల్లి, ఏప్రిల్ 18: మండల కేంద్రంలో బాల్య వివాహాన్ని అధికారులు గురువారం అడ్డుకున్నారు. మండల కేంద్రానికి చెందిన మైనర్ బాలికకు అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువకుడితో గురువారం వివాహానికి ఇరువురు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. బాల్య వివాహం చేస్తున్నట్లు సమాచారం అందడంతో సీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్ బుజ్జి, చైల్డ్ లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జ్యోత్స్న, తహశీల్దార్ మాలతి, పోలీసులు బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఇరువురి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చట్టరిత్యా నేరమని అధికారులు సూచించారు. అనంతరం ఇరుకుటుంబ సభ్యులను తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

● అంక్సాపూర్‌లో బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఆర్మూర్‌రూరల్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. 15ఏళ్ల మైనర్ బాలికకు ఆర్మూర్ మండలంలోని ఓగ్రామానికి చెందిన యువకునితో ఆదివారం వివాహం చేయడానికి తల్లిదండ్రులు నిశ్చయించారు. దీంతో సమాచారం అందుకున్న బాలల సంరక్షణ అధికారులు బాల్య వివాహాల నిరోధక అధికారులు వేల్పూర్ పోలీస్ సిబ్బంది సహాయంతో పెళ్లి ప్రయత్నాలు అడ్డుకున్నారు. అనంతరం మైనర్ బాలిక కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చేయడం ద్వారా కలిగే అనార్థాలను వారికి వివరించి ఒప్పించారు. ఈకార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ జమురు, సూపర్‌వైజర్‌లు గంగ హంస, బాబు, పంచాయతీ సిబ్బంది, పోలీస్‌సిబ్బంది, అంగన్‌వాడిలు పాల్గొన్నారు.

గోవింద్‌పేట్‌లో రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



గోవింద్‌పేట్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్18: ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వరి కల్లాలు, చేస్తున్న రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈసంద ర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ మానస మాట్లాడుతూ వడదెబ్బ సోకిన వారికి తక్షణమే వైద్య సహాయం అందించాలన్నారు. శారీరంలోని ఉష్ణోగ్రత 40డిగ్రీల సెంటిగ్రేట్ అంతకంటే ఎక్కువగా అయినప్పుడు వడ దెబ్బకు గురైనట్టు నిర్ధారించుకోవాలన్నారు.వేసవిలో వీలైనంత ఎక్కు వ మొత్తంలో నీటిని తాగాలని మధ్యాహ్నం వేళల్లో అత్యవసర మైతే తప్ప బయటకు వెళ్లొద్దని, వేయాల్సి వస్తే తలపై టోపీ, లేదా కాటన్ టవల్ ధరించాలన్నారు.ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగడంవల్ల కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చన్నారు. అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బం ది, వంతులు, తలనొప్పి, స్పృహ కోల్పోవడం, వడదెబ్బ లక్ష ణాలు అని వైద్యాధికారులు సూచించారు.ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మ ణ్, కల్పన, తరంగిని, ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

కోటగిరి,ఏప్రిల్18: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఉపాధి కూలీలకు వచ్చే వారి సంఖ్య తక్కువగా ఉందన్నారు. కూలీల సంఖ్యను పెంచడంతో పాటు పని ప్రదేశంలో కూలీలకు కనీస వసతులు కల్పించాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. తాగునీటి సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మారుతీ, ఏపీవో గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నేడు బోధన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

బోధన్‌రూరల్,ఏప్రిల్18: నేడు బోధన్ పట్టణంలోని రవి గార్డెన్స్‌లో సాలూర, బోదన్ మండలాల కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డితో పాటు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరుకానున్నారన్నారు. కావున బోధన్, సాలూర మండలాల బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్, మందర్నా రవి, వై.నరేందర్ రెడ్డి, ఆదినారాయణలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్18: ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీసర్పంచ్ పెంబర్తి నరేష్, మాజీ ఎంపీటీసీ బక మల్కన్న, మాజీఉపసర్పంచ్ ఉమ్మెడ నర్సయ్యతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన సుంకరి సంతోష్, సింగిరెడ్డి సాయిలు, చింతకుంట గంగాధర్‌లు బీఆర్ ఎస్ పార్టీని విడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీఛైర్మన్ యాల్ల సా యిరెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీఛైర్మన్ మార చంద్రమోహన్‌ల సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోచన్న, లోక అశోక్‌రెడ్డి, రవి, ఎంపీపీ పస్కనర్సయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సాపల్లి జీవన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్బన్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 5గంటలకు నిజామాబాద్ అర్బన్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు ఒక ప్రకటనలో తెలిపారు. నగరం లోని కంఠేశ్వర్‌లోగల లక్ష్మీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జి సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు.నగరంలోని అన్ని డివిజన్‌లకు చెందిన ముఖ్య కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

అకాల వర్షంతో పంట నష్టం

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్18:పట్టణంలో బుధవారం రాత్రి కురిసిన అకా ల వర్షంతో వరి పంట నెలకొరిగింది. కలాల్లో ఉన్న వరిధాన్యం తడిసి ముద్దయ్యింది. దీంతో రైతులు నష్టం వాటిల్లిందని వెంట వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను కోరారు.



ఆర్మూర్‌లో కురిసిన వర్షంతో నేలకొరిగిన వరి పంట